

స్కిల్ హబ్ కేంద్రంలో నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించమే లక్ష్యంగా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ కేంద్రం' మంజూరు అయినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. చిత్తూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ద్వారా యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రీషన్, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 8వ తరగతి, ఆపై విద్యార్హత కలిగిన 15 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉన్నవారు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రోజుకు నాలుగు గంటలు మాత్రమే శిక్షణ ఉంటుందని, శిక్షణానంతరం సర్టిఫికెట్లు జారీ చేయడంతో పాటు ప్రముఖ కంపెనీలు, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఈనెల 21 నుండి 26వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం ఎన్ఏసీ స్కిల్‌హబ్ శిక్షణ కేంద్రం, ఇరువారం, చిత్తూరు, 99892 45224, 90008 81066, 99664 89502 సంప్రదించాలని కోరారు.

పంచాయతీ కార్మికులకు కోర్టు తీర్పును అమలు చేయాలి

కలెక్టరేట్ వద్ద సిఐటియు నిరసన


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లాలో ఉన్న పంచాయతీ కార్మికులకు హైకోర్టు ఆర్డర్ ప్రకారం అందర్నీ కొనసాగించే విధంగా అమలు చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ఏపీ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాసి వెంకట రామయ్య, ఉమ్మడి జిల్లా నాయకులు రాము, మధు, సురేంద్ర మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్స్‌ను జిల్లాల్లో అమలు చేయకపోవడం దారుణమన్నారు. డిపిఓ కింది స్థాయి అధికారులకు పంపి ఆర్డర్‌ను అమలు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. నెలల తరబడి ఆర్డర్స్‌ను అమలు చేయకపోవడం కోర్టు ధిక్కరణ కేసు అవుతుందని అన్నారు. జిల్లా మూడుగా విభజన అయి అధికారులు ఎవరికి వారు యమునా తీరే అనే పద్ధతిలో వ్యవహరిస్తూ పంచాయతీ కార్మికులతో ఆడుకోవడం సిగ్గుచేటు అన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వాటర్ సప్లై ఇతర అన్ని రకాల సమస్యలను పరిష్కారం చేయడంలో పంచాయతీ కార్మికులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని అలాంటి కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల జీతాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ కోత విధించిన ఆ ఖాతాలకు జమ చేయకపోవడం వలన కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఆ పథకం సౌకర్యాలు కోల్పోతున్నారు. అధికారులు సంవత్సరాలగా పీఎఫ్ డబ్బులు జమ చేయకపోవడం దారుణమన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.

20 రోజులు సమయం ఇవ్వండి : కలెక్టర్ హామీ

కలెక్టర్ హైకోర్టు ఆర్డర్స్‌ను క్షుణంగా పరిశీలించి డీపీఓని పిలిచి జిల్లాలోని అన్ని ఎంపీడీవోలు, సెక్రటరీస్‌కి వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. 20 రోజులు సమయం ఇవ్వండి మీ సమస్యలను పరిష్కారం చేస్తానని కార్మికులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల పంచాయతీ కార్మికుల నాయకులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

- పిజిఆర్ఎస్‌కు 276 అర్జీలు


ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి అధికారులు పని చేయాలని, ప్రతీ అర్జీకి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్ధవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 228, పంచాయతీ రాజ్ 3, పోలీసు శాఖ 7, డిస్ట్రిక్ట్ రిజిస్టర్ 2, అనిమల్ హస్బండ్రీ 5, హార్టికల్చర్ 1, డిఆర్‌డిఏ 10, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, డీఈవో 2, డిఎం అండ్ హెచ్ఓ 2, హౌసింగ్ 3, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో 1, మార్కెటింగ్ 1, ఐసిడిఎస్ 1, రెస్కో 1, ఎల్ డిఎం 1, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ 1, సోషల్ వెల్ఫేర్ 1, డిస్ట్రిక్ట్ వాటర్ రిసోర్స్ ఆఫీసర్ 1, ఎంపీడీవో సదుం 1 అర్జీ అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అసిస్టెంట్ కలెక్టర్ డిఆర్ఓ, ఆర్‌డిఓలకు అందజేశారు.

ప్రజా ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఇంచార్జ్ అడ్మిన్ ఎస్ఆర్. రాజశేఖర్ రాజు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 66 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా వాటిని సమర్థవంతంగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి, అడిషనల్ ఎస్పీని, చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ టి.సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను వినిపించారు. ఫిర్యాదులకు స్పందిస్తూ, బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 66 ఫిర్యాదులు అందాయి, వాటి వివరాలు చీటింగ్ 1, కుటుంభ తగాదాలు 14, వేధింపుల 1, ఇంటి తగాదాలు 2, భూ తగాదాలు 22, డబ్బు తగాదాలు 19, ఆస్తి తగాదాలు 7 ఉన్నాయి.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

సకాలంలో పీజీఆర్ఎస్ వినతులు పరిష్కరించాలి


ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. ఫిర్యాదులు, వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఇంజనీరింగ్ 3, రెవెన్యూ 1, మెప్మా 1, ప్రధాన కార్యాలయం 1 చొప్పున మొత్తం ఆరు వినతులు అందాయి. ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

31 వరకు ఉచిత పశు వైద్యశిబిరాలు


ఉచిత పశు వైద్యశిబిరాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం నుండి ఈనెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా సచివాలయం నూతన గ్రీవెన్స్ హాల్‌లో సోమవారం నుండి ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన నిధులు కేటాయిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని, ఈ క్రమంలో పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి, పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి, ఆర్థిక అండను కలగచేయడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పశుసంవర్థక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి అన్ని గ్రామలలో పశు ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించబడుతుందని, ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు పశు వైద్యులలు పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తారని తెలిపారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహించబడును. ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టరు హిమవంశీ, డిఆర్ఓ మోహన్ కుమార్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

యానాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- శ్మశానం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం మొగిలి యానాదుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడం జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ మొగిలి యానాదుల శ్మశానాన్ని ఆక్రమించారని మూడు నెలల క్రితం కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా కలెక్టర్ మొత్తం సర్వే చేయించి మొగిలి ఊరి గుట్ట వద్ద ఉన్న 59 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని తేల్చారని, ఈ స్థలంలో 12 మంది ఆక్రమదారులు ఉన్నారని రెవెన్యూ అధికారులు ప్రకటించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు మొగిలి యానాదలకు శ్మశానం 60 సెంట్లు కేటాయించి, స్కెచ్ ఇచ్చి హద్దులు చూపినా శ్మశానంలో అగ్రకులస్తులు బోరువేసి ఆక్రమించారని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు. యానాదులకు మూడు సెంట్లు ఇంటి స్థలంకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని, ఆక్రమదారుల పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన స్థలంలో ప్రజాప్రయోజనాల కోసం యానాదులకు స్కూలు, హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్మశానంలో ఆక్రమణలు తొలగించి పెన్సింగ్ వేయాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని దశలవారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో మండల సిపిఎం నాయకులు బంగారు మురళి, మొగిలి యానాదుల సంఘం కమిటీ అధ్యక్షురాలు నిర్మల, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, యానాదులు

పెద్దిరెడ్డి అనర్హత కేసులో టీడీపీది మేజర్ రోల్..

- ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్ వాదన
- ఫిబ్రవరి 3కి వాయిదా వేసిన హైకోర్టు


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై హైకోర్టులో దాఖలైన అనర్హత పిటిషన్ కీలక దశకు చేరుకుంది. దీనిలో టీడీపీ ప్రభుత్వ వైఖరి ఏమిటనేది ఇప్పుడు తేలిపోనుంది.. దాదాపు 140కి పైగా భూములను ఆస్తులుగా అఫడవిట్‌లో చూపించని విషయాన్నీ ఆధారాలతో సహా కోర్టులో పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే.. బీసీవైపార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.. దీనిపై ఇప్పటికే 14 వాయిదాలు ముగిసాయి. కోర్టు నుండి నోటీసులు వెళ్ళినప్పటికీ ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన టీడీపీ సహా ఇతర అభ్యర్థులు ఎవరూ దీనిలో ఇంప్లీడ్ అవ్వలేదు.

రెవెన్యూ శాఖకు నోటీసులు..

ఈ కేసులో పెద్దిరెడ్డి భూముల వ్యవహారమే కీలకం. ఈ భూములపై పిటిషనర్ అన్ని రకాల ఆధారాలు కోర్టుకి అందించినప్పటికీ వాటిని రెవెన్యూ శాఖ ధ్రువీకరించాల్సి ఉంది. అందుకే ఈ కేసులో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శిని ప్రతివాదిగా చేర్చి నోటీసులు ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకి విన్నవించారు.. దీనిపై పరిశీలించి ఆదేశాలు ఇస్తామన్న కోర్టు తదుపరి విచారణను ఫిబ్రవరి 3కి వాయిదా వేశారు.. ఈ ఆస్తులపై ప్రభుత్వం త్వరితగతిన స్పందించి ధ్రువీకరణ ఇస్తే కేసు దాదాపు ముగిసిపోయే అవకాశం ఉంది.. పెద్దిరెడ్డి కూడా తప్పించుకునే అవకాశం ఉండదు. ఆ పిటిషన్ లో పేర్కొన్న భూములు అఫడవిట్ దాఖలు చేసే సమయానికి పెద్దిరెడ్డి, అతని కుటుంబ సభ్యుల పేర్లపైనే ఉన్నాయనే అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సి ఉంది!

జాతీయ భావం ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవ వేడుకలు


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతీయ భావం ఉట్టిపడేలా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను డిఆర్ఓ కె.మోహన్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక సచివాలయంలోని డిఆర్ఓ సమావేశ మందిరంలో ఈనెల 26వ తేదీన చిత్తూరు జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో డిఆర్ఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమ పూర్తి సమన్వయం చిత్తూరు ఆర్‌డిఓ, ప్రోటోకాల్, సిటింగ్ ఏర్పాట్లు, ఆహ్వాన పత్రికల ముద్రణ పంపిణీ విధులు చిత్తూరు తహశీల్దార్, భద్రతా ఏర్పాట్లు, స్టేజి డెకొరేషన్ విధులు పోలీస్‌శాఖవారు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, విద్యార్థుల పాల్గొనేలా బాధ్యత డీఈఓ, ఆస్తుల పంపిణీ కార్యక్రమంను డిఆర్‌డి ఏపిడి, అత్యవసర వైద్యసేవలను డిఎం అండ్ హెచ్ఓ, పారిశుద్ధ్యం, నీటి సరఫరా విధులను చిత్తూరు మున్సిపల్ కమిషనర్, అగ్నిమాపక వాహనాల ఏర్పాట్లను డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్, స్టాల్స్ ఏర్పాటును వ్యవసాయ శాఖ జేడి, సమగ్ర శిక్ష ఏపిసి, హౌసింగ్ పిడి, డిఆర్డిఏ పిడి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడి, విస్తృత ప్రాచార ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్ ఏర్పాట్లను సమాచారశాఖ అధికారులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ బాబు, డ్వామా, డిఆర్డిఏ పీడీలు రవి కుమార్, శ్రీదేవిలు, డీఈఓ వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపిసి వెంకటరమణ, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఇంచార్జ్ పీడీ గోపాల్ నాయక్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, కలక్టరేట్ ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

పాల దిగుబడి పెంపుపై రైతులకు సూచనలు



సోమలలో..

ప్రజాశక్తి- సోమల: పాడి రైతులు తమ పశువుల పెంపకం, పోషణ, పాల దిగుబడి పెంచడంలో అధికారుల సూచనలు సలహాలు పాటించి ఆర్థికంగా లబ్ధి పొందాలని పశువైద్యాధికారిని చందన ప్రియ కోరారు. పశువుల ఆరోగ్య శిబిరాలను మండలంలో ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సోమవారం తమ్మినాగినిపల్లి పంచాయతీ కోటగుండ్లపల్లి గ్రామంలో 195 పశువులకు పిడుదల మందు, 93 ఆవులకు 23 దూడలకు నట్టల నివారణ మందు, 145 గొర్రెలకు టీకాలు వేయడం జరిగిందన్నారు. అలాగే 26 పశువులకు గర్భకోస వ్యాధుల చికిత్స అందజేశామని ఈ కార్యక్రమాన్ని మండలంలోని మిగిలిన అన్ని పంచాయతీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. పశు వైద్య సిబ్బంది సహదేవ, సురేష్, అనూష, సుధాకర్, ఓబులేసు పాల్గొన్నారు.

రామకుప్పం: పశువులకు గాలి కుంట మందులతో వ్యాధులు దూరమవుతాయని మాజీ సర్పంచ్, మాజీ రెస్కో డైరెక్టర్, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ రామ్మూర్తి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ ఆనిగనూరు గ్రామంలో ప్రభుత్వ ఆదేశానుసారం ఉచిత పశువుల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు చర్యలు తీసుకొని పశువులకు రోగాలు నివారించేందుకు వైద్యాధికారుల సూచనల మేరకు పాడి రైతులు మందులు వేయించాలన్నారు. పాడి రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లని సైతం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పశు వైద్య అధికారి వెంకటేష్, టీడిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, కృష్ణారెడ్డి, శంకర్ చలం, మహేంద్ర నాయుడు పాల్గొన్నారు.


రామకుప్పంలో..


ఎస్ఆర్ పురంలో..

ఎస్ఆర్ పురం: ప్రతి గ్రామ పంచాయతీలలో పశు ఆరోగ్య శిబిరాలను ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తారని పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని క్షీరసముద్రం గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పశువులకు పశు వైద్యశిక్షణ గర్భకోశ వ్యాధులకు నట్టల నివారణ పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు శాస్త్రీయ యాజమాన్యంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జయశంకర్ నాయుడు, పశువర్ధక శాఖ ఏడి డాక్టర్ రూప సుందరి, పశువైద్యాధికారి శ్రీవిద్య, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ద్రావిడ యూనివర్సిటీలో

న్యాక్ టీమ్ మూడు రోజుల పర్యటన


యూనివర్సిటీలో అన్ని ఏర్పాట్లు చేసిన సిబ్బంది

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈనెల 22, 23, 24న న్యాక్ టీమ్ వర్సిటీని సందర్శించనుంది. ఏడుగురు సభ్యులతో కూడిన న్యాక్ పీర్ టీమ్ మూడు రోజులు పాటు వర్సిటీలోని ప్రతి విభాగాన్ని సందర్శించి వర్సిటీ గ్రేడింగ్ కోసం నివేదిక సమర్పించనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విశ్వవిద్యాలయం ఈ మధ్యనే క్లాస్ రూమ్స్, వసతి గృహాలను శంకుస్థాపన చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. అదేవిధంగా ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరగడం విద్యార్థులకు అన్ని రకాల ల్యాబ్స్, ఈ క్లాస్ రూమ్స్, నైపుణ్యంతో కలిగిన అధ్యాపకులతో ఉత్తమ బోధనా తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయంకు న్యాక్ మంచి గ్రేడ్ సాధిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాక్ టీమ్ సందర్శన కోసం వర్సిటీలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి అయ్యింది.

ఉపాధి విజిలెన్స్ అధికారి తనిఖీలు

ప్రజాశక్తి- యాదమరి: మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల తనిఖీలలో భాగంగా సోమవారం చిత్తూరు జిల్లా ఉపాధి హామీ స్పెషల్ టీం విజిలెన్స్ జిల్లా డీవీవో శివయ్య కోనాపల్లి గ్రామంలో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉపాధి పనులు కల్పించాలని లక్ష్యంతో ఉపాధి పనులను పేద కూలీలు రైతులకు గ్రామాల్లో పనులు కల్పిస్తున్నారు. యాదమరి మండలంలో ఉపాధి హామీ పథకంలో ఎక్కువ నిధులు వెచ్చించిన గ్రామపంచాయతీలను ఎంపిక చేసుకుని గత కొద్ది రోజులుగా జరిగిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై తనిఖీ చేశారు. కోనాపల్లి చెరువులో ఫిష్ ఫండ్, క్యాటిల్ ఫండ్ పనులను పరిశీలించారు. చేసిన పనులు కొలతలు తీశారు. రెండు పనుల్లో చేసిన పనులు, జంబుక్ రికార్డులు నమోదు చేసిన కొలతలు, ఫీల్డ్‌లో ఉన్న కొలతలను పరిశీలించారు. గ్రామంలోని ఉపాధి కూలీలకు అవసరమైన పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఓ బాలాను ఆదేశించారు. ఉపాధి పనులు చేపట్టడంలో అవసరమైనచోట పనుల కల్పన, పారదర్శకత పాటించాలన్నారు. ఉపాధి హామీ సహాయకులు బాల, జేఈ పరమశివం, టెక్నికల్ అసిస్టెంట్ మధు, ఫీల్డ్అసిస్టెంట్ బాబు, పాల్గొన్నారు.


కోనపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారి శివయ్య

థమ్స్‌అప్ భలే ఉంది..



ఓ వానరం థమ్స్అప్ కూల్‌డ్రింక్ బాటిల్ మూత తీసి తాగుతూ ఎంజాయ్ చేసిన దృశ్యం ప్రజాశక్తి విలేకరి కంటపడింది. సోమవారం బంగారుపాళ్యం మండలంలోని ప్రధాన మార్గంలోని ఓ దుకాణం వద్ద ఉన్న వానారాల్లోని ఒక దానికి థమ్స్అప్ బాటిల్ దొరికింది. దాని మూత తీయడానికి నానా అవస్థలు పడిన వానరం చివరకు నోటితో రంధ్రం చేసి తాగుతూ రుచిని ఎంజాయ్ చేసింది. ఈ దృశ్యం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. **- బంగారుపాళ్యం**

వికలాంగ పింఛన్ వెరిఫికేషన్ ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 20వ తేదీ సోమవారం నుండి సెప్టెంబర్ 23వ తేదీ వరకు జిల్లాలోని వికలాంగ పింఛనుదారులను పరిశీలించి సదరం సర్టిఫికెట్లను జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియ సోమవారం నుండి జిల్లాలో ప్రారంభమైంది. వారంలో మూడు రోజులు చొప్పున మండల అభివృద్ధి అధికారులు మున్సిపల్ కమిషనర్ల నేతృత్వంలో వికలాంగ పింఛన్ వెరిఫికేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ మెడికల్ క్యాంపుల్లో రోజుకు 50 మంది చొప్పున ఉదయం 25 మందికి మధ్యాహ్నం 25 మందికి సంబంధిత క్యాంపుల్లో వైద్యులు అంగవైకల్య పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను జారీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వికలాంగ పింఛన్ వెరిఫికేషన్ క్యాంపులకు స్థానికంగా ఉన్న వికలాంగులను సచివాలయ సిబ్బంది తీసుకురానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగ పింఛన్ల వెరిఫికేషన్ చేసి కొత్త సర్టిఫికెట్లను జారీ చేయనున్నట్లు డిఆర్డిఏ పిడి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీకి చెందిన దళితవాడలో తాగినటి సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సర్పంచ్ రీటా యల్లప్ప వెంటనే స్పందించారు. నీటి సరఫరా అయ్యే పైపులైను పగిలిపోవడంతో దళితవాడకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పగిలిన పైపులైను జెసిబి సాయంతో మరమ్మత్తులు చేసి యథావిధిగా మంచినీటిని సరఫరా అయ్యేలా పనులు చేయించారు.



తాగునీటి పైపు మరమ్మతులు చేస్తున్న సర్పంచ్

అభివృద్ధి పనులు చేపట్టండి..!




సమావేశంలో మాట్లాడుతున్న టీడిపి మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి

ప్రజాశక్తి -రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని టిడిపి మండల అధ్యక్షులు ఆనందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పంచాయతీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 –2026 ఆర్థిక సంవత్సరానికి గాను 25 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయిందన్నారు. వీధి దీపాలు, తాగు నీరు, డ్రైనేజీలు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. సర్పంచ్ రాజగోపాల్, యూనిట్ ఇంచార్జ్ మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, ఆనందప్ప, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళీ మోహన్ పాల్గొన్నారు.

అంగవైకల్యం రాకుండా చూసుకోవాలి

డాక్టర్ లోహిత్ చంగల్ రాయులు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అంగవైకల్యం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తుంబకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయల్ తెలిపారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి రెండో తారీఖు వరకు గ్రామాల్లో ఇంటింటా సర్వే చేపట్టాలని నొప్పిలేని మచ్చలు వాటిని గుర్తించాలని, వారికి ప్రాథమిక వైద్య కేంద్రంలో పరీక్షలు చేయించి తగిన మందులు అందివ్వాలని దీని ద్వారా కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం చేపట్టినట్టు అన్నారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. వైద్యులు రమేష్, డిపిఎంఓ మనీ, సిహెచ్ఓ నాగలక్ష్మి, ఎంపీహెచ్వో రమేష్, సూపర్వైజర్లు హరికృష్ణ, ఆముద ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'కేసులు మాఫీకి వెంటనే స్పందించాలి'

ప్రజాశక్తి -పుంగనూరు : గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులపై పెట్టిన కేసులపై కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే మాఫీ చేయాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్.సజ్జద్ బాషా సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఉన్న ప్రభుత్వంలో భయంతో రాజకీయ పార్టీల కార్యకర్తలు రాష్ట్రం వదిలి వెళ్లిపోయారు వారిని తిరిగి రప్పించాలన్నారు. గతంలో పార్టీ కార్యకర్తల మీద పెట్టిన కేసులను ఇంతవరకు మాఫీ చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. అధికారంలో వచ్చిన నెలలోనే మాఫీ చేస్తామని చెప్పిన మాట కార్యకర్తల మీద మోపిన కేసులు ప్రత్యేక చట్టం కమిషన్ ద్వారా రద్దు చేస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాన్ని అందించండి

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుల ధ్రువీకరణ పత్రాన్ని అందించాలని కోరుతూ పిలమర్రై కల్లర్ సంఘం నాయకులు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించినట్లు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శివ తేవర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పిలమర్రై కల్లర్ కులస్తులు తమ కుల గుర్తింపు కోసం పోరాటం చేస్తున్నారని, ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో పర్యటించిన సందర్భంగా ఆయన కలిసి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయవలసిందిగా కోరి వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ విషయమై స్పందించిన ముఖ్యమంత్రి తరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చర్యలు చేట్టి కులస్తుల సమస్య పరిష్కారానికి సహకరించాల్సిందిగా కోరినట్లు తెలిపారు.



తెల్లవారినా తగ్గని మంచు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండల కేంద్రంలో ఉదయం ఎనిమిది అయినా భారీ మంచు కురుస్తూనే ఉంది. వంద అడుగుల తర్వాత ఉన్న మనుషులు, వాహనాలు కానీ కనిపించనంతగా మంచు పూర్తిగా కమ్ముకుంది. ఈ మంచు వలన అనారోగ్యాలు ఎక్కువ అవుతాయని, అనారోగ్యం భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అనారోగ్యానికి గురైన కార్యకర్తను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పరామర్శించారు. సోమవారం న్యాకయనికట్టు వీధిలో నివాసముండే కార్యకర్తలు ధనలక్ష్మి, మురళీలను వారి ఇంటికెళ్లి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే కయనికట్టు వీధిలో ఏర్పాటుచేసిన ఎస్వీ పెరాలసిస్ క్లినిక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నాయకులు వసంత కుమార్, ఉమ్మడి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి- పుంగనూరు: ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ పుంగనూరు తాలూకా అధికారుల సంఘం రూపొందించిన 2025 వార్షిక క్యాలెండర్‌ను పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి స్వగృహంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీవో పుంగునూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎం.రహమత్ అలీ ఖాన్, కార్యదర్శి సి.సురేష్ రాజు, సహ అధ్యక్షులు డి.లక్ష్మి, నారాయణ, డి.మురళి, బాబు, ఎం.వరసుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి దాము, వై.వెంకట ముని, కోశాధికారి రఘురామయ్య, టిడిపి నాయకుడు సివి.రెడ్డి పాల్గొన్నారు.

పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

స్థానిక బ్రాహ్మణ వీధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణంలో పిఆర్‌టియు క్యాలెండర్ డైరీని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జివి.రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రుద్రాణి ఆవిష్కరించారు. శోభారాణి, అనురాధ, గీతాంజలి, శోభన, లతశ్రీ, భూదేవి, ముత్యాలు, విశాలాక్షి, సుగుణ, రామకృష్ణ, త్రివేణి, గాయత్రి, జ్యోతి, ఆమని, జీవలత పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి వెంకటగిరి దళితవాడలో ఓం శక్తి భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఓంశక్తి చిత్రపటానికి ప్రత్యేకపూజలు చేశారు. సోమవారం రాత్రి ఇరుముడిలతో మేలు మరుగుతురుకు వెళ్లి మొక్కులు చెల్లించనున్నట్టు గురుశక్తి గోవిందయ్య తెలిపారు. నరేష్, సోమశేఖర్, కుమారి, అమరన్ పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యులుగా అస్మ అంజుమ్



ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: వింజం పంచాయతీ సిద్దేశ్వర కొండ హోమియోపతి హాస్పిటల్‌కు నూతన వైద్యులుగా అస్మ అంజుమ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హాస్పిటల్లో నిరంతరం అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందిస్తామని ఆమెపేర్కొన్నారు.

చేపల చెరువులు వేలం

రూ. 2.91 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం పరిధిలోని చెరువుల వేలం పాట ద్వారా పంచాయతీకి రూ. 2లక్షల 91 వేలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ ధనంజయవర్మ తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయం ఆవరణంలో పంచాయతీ ఈవో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో చేపల చెరువుల వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని నగరం చెరువుకు రూ.1,26,000లు, స్వామివారిపాదం చెరువుకు రూ.24వేలు, కుమ్మరగుంటకు రూ.13,500, దొరవారిగుంట రూ.50వేలు కసవరాజ గుంట రూ.7,500లు ఆదాయం వచ్చిందన్నారు. చెరువుల వేలంపాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హలో బీసీ.. చలో ఢిల్లీ.. పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఫిబ్రవరి 6వ తేదీ నిర్వహించనున్న హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో హలో బీసీ చలో ఢిల్లీ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ షణ్ముగం మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు, రాజకీయ ఆర్థిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఫిబ్రవరి 6వ తేదీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా నుండి పెద్దసంఖ్యలో బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్రరాజు, నాయకులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంతో డిజిటల్ హెల్త్ సెంటర్



విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలకు దోచుకుంటున్న డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులోని అపోలో విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి అపోలో విశ్వవిద్యాలయం, అపోలో హాస్పిటల్స్, లీసెస్టర్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. డిజిటల్ హెల్త్, ప్రెసిషన్ మెడిసిన్ కోసం ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడానికి ఈ అధునాతన పరిశోధనా కేంద్రం రెండు సంస్థల నైపుణ్యం, వనరులను ఒకే చోటకు తీసుకురానుంది. సిడిహెచ్‌పిఎం సెంటర్ భారతదేశంలోని చిత్తూరు కేంద్రంగా ఉంటుంది. లీసెస్టర్ విశ్వవిద్యాలయంలోని కేంద్రం లీసెస్టర్‌లోని గ్లెన్‌ఫీల్డ్ హాస్పిటల్‌లోని బిహెచ్‌ఎఫ్ కార్డియోవాస్కులర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాలు అయ్యింది. ఈ కేంద్రం సహడైరెక్టర్లుగా లీసెస్టర్ విశ్వవిద్యాలయంలో కార్డియాలజీ ప్రొఫెసర్, ప్రొఫెసర్ సర్ నీలేష్ జె సమాని, అపోలో విశ్వవిద్యాలయంలోని అనుబంధ ఫ్యాకల్టీ, అపోలో హాస్పిటల్స్ చీఫ్ మెడికల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ సుజోయ్‌కర్ ఉంటారు. సోమవారం అపోలో యూనివర్సిటీలో డిజిటల్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన అపోలో వ్యవస్థాపకులు డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి మాట్లాడుతూ అపోలో యూనివర్సిటీలో తాము ఎల్లప్పుడూ ఆరోగ్యానికి అనుకూలంగా ఉన్నామని, సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ ఆ నమ్మకంపై ప్రధానంగా ఆధారపడి రూపుదిద్దుకుందని తెలిపారు. సిడిహెచ్‌పిఎంతో తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులకు తగినట్లుగా వ్యాధి అంచనా, నివారణ, రోగ నిర్ధారణ, నిర్వహణను మెరుగుపరచడం ద్వారా ఆరోగ్య సంరక్షణ డెలివరీని మార్చాలని కోరుకుంటున్నామన్నారు. ప్రపంచ ఆరోగ్య సంరక్షణను తీవ్రంగా ప్రభావితం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ తరహా పురోగతులు ప్రపంచవ్యాప్తంగా రోగులకు ప్రయోజనం చేకూరుస్తాయని మరియు వ్యక్తిగతీకరించిన, డేటా–ఆధారిత వైద్యం భవిష్యత్తును రూపొందిస్తాయని ఖచ్చితంగా భావిస్తున్నానని తెలిపారు. లీసెస్టర్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో నా జన్మస్థలంలో ఈ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించినందుకు నేను సంతోషంగా ఉందన్నారు.


వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా బాలాజీ



ప్రజాశక్తి- కార్వేటినగరం: పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డిని మళ్లీ గెలిపించుకుని, పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకురావాలని నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కార్యాలయ సముదాయంలో ఎంపీపీ లతబాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గం ముఖ్యనాయకుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రాజు, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్సీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన శ్రీరాములు నాయుడు కుటుంబానికి జిల్లా వ్యాప్తంగా గుర్తింపు ఉందని శ్రీరాములు నాయుడు 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో ప్రజలసమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేశారని అలాంటి కుటుంబానికి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి ఆయన తనయుడు బాలాజీకి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా పదవిని అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బాలాజీ మాట్లాడుతూ ప్రజలు తమపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని, తన తండ్రి బాటలో నడుస్తూ ప్రజలకు నిత్యం సేవలు అందిస్తానని తెలిపారు. అనంతరం బాలాజీని నాయకులు శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నాయకులు చందురాజు, శ్రీనివాసులు, కార్తీక్ రెడ్డి, గుణవతి, లోకానాథం నాయుడు, పురంధర్, శేషాద్రి, లోకనాథరెడ్డి, దేశయ్య, విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో సోషల్ ఆడిట్ తనిఖీలు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని సోమల ప్రాథమిక పాఠశాల, నెల్లిమంద ప్రాథమికోన్నత పాఠశాలలలో సోమవారం సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. సామాజిక తనిఖీ పారదర్శకత జవాబుదారీ సంస్థ వారి ఆదేశానుసారం ఎస్‌ఆర్పి మల్లికార్జున, కే.వీరభద్రారెడ్డి, రిసోర్స్ పర్సన్ సుధాకర్ రెండు పాఠశాలలో సోషల్ ఆడిట్ నిర్వహించి విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్నం భోజనం, మరుగుదొడ్లు పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ కమిషనర్ వారి ఆదేశానుసారం ఎంపిక చేసిన పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి పాఠశాలకు సంబంధించిన అన్ని విషయాలను 28 రికార్డులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి నివేదికలను కమిషనర్‌కు పంపించడం జరుగుతుందన్నారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను కూడా తీసుకొని పాఠశాలకు అవసరమైన అదనపు తరగతి గదులు ఆటస్థలం ఫర్నిచర్ తదితర అంశాలను కూడా నమోదు చేసి నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. మూడు రోజులపాటు తాము మండలంలో ఉండి 22వ తేదీ ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మరిన్ని వివరాలను అవసరమైన సదుపాయాలను వారి నుండి తెలుసుకొని నివేదికలు పంపడం జరుగుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న తనిఖీ బృందం

అడిషినల్ కోర్ట్‌ను ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో అడిషినల్ కోర్టును త్వరగా ఏర్పాటు చేయించాలని పలమనేరు బార్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలమనేరుకు అడిషినల్ కోర్టు కొరకు హైకోర్టు సిఫార్సు చేసిందని కోర్టు మంజూరు అయినప్పటికీ గత ప్రభుత్వంలో ఫైనాన్స్ డిపార్ట్మెంట్ వరకు వచ్చి పనులు ఆగిపోయాయన్నారు. పుంగనూరు, కుప్పంలలో ఇప్పటికే అడిషనల్ కోర్టులను ఏర్పాటు చేశారని సుమారు 5500 కేసులు పైగా ఉన్నటువంటి పలమనేరులో అడిషనల్ కోర్టు లేకపోవడంతో 20 ఏళ్లకు పైగా ఉన్న కేసులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వంతో చర్చించి త్వరితగతిన పలమనేరులో అడిషనల్ కోర్టును ఏర్పాటు చేయించాలని వారు కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, కార్యదర్శి భరకత్, న్యాయవాదులు ఎల్.భాస్కర్, లోకేష్, షరీఫ్, జె.సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, రెడ్డెప్ప, మునిరాజు, సమర్త్, ఇబ్రహీం, సుబ్బారామయ్య ఉన్నారు.



ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

హెల్మెట్ ప్రాణానికి రక్ష : తహశీల్దార్



బంగారుపాళ్యంలో ర్యాలీని ప్రారంభిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: హెల్మెట్ ప్రాణానికి రక్షణ కవచమని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో హెల్మెట్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు హెల్మెట్ తలకు రక్షణ కవచంగా ఉంటుందని అన్నారు. హెల్మెట్ వాడాలని ద్విచక్ర వాహన ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ లేక తలకు గాయాలై మరణించిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. ఆర్ఐ మధుసూదన్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఓ, వీఆర్ఏలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలని పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ అన్నారు. సోమవారం చౌడేపల్లి పుంగనూరు ప్రధాన రహదారిలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, మద్యం తాగి వాహనాలను నడపరాదని అన్నారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చౌడేపల్లిలో..

క్రైం న్యూస్

బోర్ డ్రిల్లింగ్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి- పలమనేరు: మండలంలోని కూర్మాయి గ్రామంలో వెంకటేష్ గౌడ్ దగ్గర పనిచేస్తున్న బోరు డ్రిల్లింగ్ కూలి ఛత్తీస్గఢ్‌కు చెందిన 21సంవత్సరాల హీరా సింగ్ సోమవారం సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: ట్రాక్టర్ ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చప్పిడిపల్లి పంచాయతీ చంద్రమాకులగడ్డ గ్రామంలో నివాసముంటున్న జి.చెన్నప్ప పండగు సెలవుల్లో కుటుంబంతో కలిసి అత్తగారింటికి వెళ్లారు. అక్కడి నుంచి సొంత గ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో శికేలాదిన్నెపల్లె మలుపు వద్ద వేగంగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చెన్నప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 ద్వారా పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు పిఎస్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చెన్నప్ప మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ కళ్లిగుట్ల గ్రామంలో ఉంటున్న రవీంద్రారెడ్డి కూతురు మైత్రి (19) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. పెద్దలు పెళ్లి కుదర్చడంతో వివాహం ఇష్టం లేని మైత్రి మనస్థాపానికి గురైన ఆదివారం పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. ఎస్ఐ పరశురాముడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణ వద్దు.. ఐక్యమత్యమే ముద్దు..

ప్రజాశక్తి- కుప్పంటౌన్: వర్గీకరణ వద్దు ఐకమత్యమే ముద్దు అన్న నినాదంతో మాలలందరూ ముందుకు వెళ్లాలని మాల మహానాడు చిత్తూరు జిల్లా అధ్యక్షులు కందస్వామి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతిని, సమసమాజ స్థాపనను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రిజర్వేషన్ తీసుకువచ్చినట్టు తెలిపారు. ఇందులో భాగంగా షెడ్యూల్ కులాల అభ్యున్నతికి సైతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడం జరిగిందని తెలిపారు. అయితే షెడ్యూల్డ్ కులాలలోని ఉపకులాలకు చెందిన కొంతమంది తమ స్వార్థం కోసం ఎస్సీలను విడగొట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఇందుకోసం ఎస్సీ వర్గీకరణను అడ్డుపెట్టుకున్నట్టు ఆరోపించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందేనన్నారు. వీటి అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకసభ్య కమిటీని నియమించడం జరిగిందని, ఈ కమిటీ అధ్యక్షులు రాజీవ్ రంజన్ మిశ్రా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఏక సభ్య కమిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మాలలందరూ జిల్లా కేంద్రానికి విచ్చేసి వర్గీకరణకు వ్యతిరేకంగా ఏకసభ్య కమిటీకి వినతి పత్రాలు అందించాలని సూచించారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజలు కలిసి రావాలని కోరారు.

కమిషనర్‌కు సిపిఎం అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రజల నుండి వచ్చే వినతులు, సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని పున్ణప్రారంభించడంతో సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 10 మంది, మరో 40 మంది వినతులు ద్వారా సమస్యలను విన్నవించారని కమిషనర్ తెలిపారు. ఇందులో ముఖ్యంగా ఆకుతోట వీధిలో మురుగు కాలువలు శుభ్రం చేయాలని, టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, కోటకొమ్మల వీధిలో సెట్ బాక్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని, ఉపాధ్యాయ నగర్ లో కుక్కల సమస్య పరిష్కరించాలని, భవాని నగర్ లో యుడిఎస్ సమస్య పరిష్కరించాలని, సాయి విష్ణు లే ఔట్ నందు కాలువలు నిర్మించాలని, రవీంద్ర నగర్ నందు రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని ప్రజలు వినతులు సమర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.